TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 63 గురువారం 8-10-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వేల:2.00/-

## కాంగ్రెస్‌పై గరంగరం!



**న్యూఢిల్లీ:**
ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా మంగళవారం ఇండియా కూటమి నిరసన ప్రదర్శన జరుగుతున్న సమయంలో కూటమి భాగస్వాములకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సెంట్రల్ ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం సమీపంలో ఉన్న ఆకాశవాణి భవన్‌లోకి ఆకస్మికంగా ప్రవేశించడం విపక్ష శ్రేణులలో ఆందోళనను రేకెత్తించింది. ఈ ఉమ్మడి ప్రదర్శన కేవలం 'అన్నాచెల్లెలి' సొంత ప్రదర్శనగా మారిపోయిందని కొందరు మిత్రపక్షాల నాయకులు భావిస్తున్నారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ 'శాంతి సూత్రం'!

- కాల్పుల విరమణకు మూడు అంశాల ప్రతిపాదన
- కీలక మౌలిక సదుపాయాలపై దాడులు ఆపాలి
- ఇంధన కేంద్రాలకు రక్షణ కల్పించాలన్న భారత్
- నిత్యావసర వస్తువుల సరఫరా కొనసాగించాలి
- నల్ల సముద్రం ద్వారా ధాన్యం, ఇంధన రవాణా
- వాణిజ్య నౌకల రాకపోకలకు భద్రత కల్పించాలి
- నౌకలపై దాడులకు ముగింపు పలకాలని సూచన
- తక్షణ ముప్పులను తగ్గించడమే ప్రధాన లక్ష్యం



02

## భారత్‌లో స్టార్‌లింక్ రెడీ!

- భారతీయ భద్రతా నిబంధనలకు అనుగుణంగా స్టార్‌లింక్ డిజైన్
- కేంద్ర ప్రభుత్వ తుది అనుమతుల కోసం ఎదురుచూపు
- గ్రామీణ, సుదూర ప్రాంతాలకు శాటిలైట్ ఇంటర్నెట్
- ఇన్-స్పేస్, శాటిలైట్ లైసెన్సుల నుంచి ప్రాథమిక అనుమతులు
- ఎఫ్‌డీఐ భద్రతా క్లియరెన్స్ కోసం దరఖాస్తు
- వినియోగదారుల డేటాను దేశంలోనే భద్రపరిచేలా ఏర్పాట్లు
- ఇప్పటికే 20కి పైగా గేట్‌వే సైట్ల నిర్మాణం
- దేశవ్యాప్తంగా డిజిటల్ కనెక్టివిటీకి మద్దతుగా స్టార్‌లింక్




02



## యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్

- రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!
- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- గరిష్ట డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి
- జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం

**తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:**
తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ. 40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ట డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం

-మిగతా 2 లో

# ఢిల్లీ ఉద్రిక్తం

### విపక్ష ఎంపీల ఆందోళనతో అట్టుడికిన దేశ రాజధాని

- సర్ రద్దు, సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్
- జంతర్ మంతర్‌వైపు వెళ్తున్న ఎంపీలను అడ్డుకున్న పోలీసులు
- 'నేను కదలను'.. రోడ్డుపై బైఠాయించిన ప్రియాంక గాంధీ
- పోలీసుల అదుపులో రాహుల్ సహా పలువురు ఎంపీలు
- ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు' : ఖర్గే
- ప్రతి ఎఫ్ఐఆర్ నాకు ఒక మెడల్.. నా టార్గెట్ 100: రాహుల్ గాంధీ
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదు: సీపీఎం

**ఢిల్లీలో విపక్ష ఎంపీల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఎంపీలు జంతర్ మంతర్ వైపు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపైనే బైఠాయించిన ప్రియాంక గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను కూడా అరెస్టు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పష్టం చేయగా.. తనపై నమోదైన ప్రతి ఎఫ్ఐఆర్‌ను మెడల్‌గా భావిస్తున్నానని, వంద ఎఫ్ఐఆర్‌లు సాధించడమే తన లక్ష్యమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఇదే అంశంపై సీపీఎం సైతం అక్టోబర్ 10న ఢిల్లీలో భారీ నిరసనకు పిలుపునిచ్చింది.**

**న్యూఢిల్లీ,**
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సహా ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన ఆందోళనతో ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జంతర్ మంతర్ వద్ద నిరసనకు వెళ్లేందుకు మూడు బస్సుల్లో బయలుదేరిన ఎంపీలను పోలీసులు అడ్డుకోవడంతో వారు అక్కడే ఆందోళనకు దిగారు. ఈ ఘటనతో కేంద్ర ఢిల్లీలో ఉద్రిక్తత పెరిగింది. పోలీసులు అడ్డుకోవడంతో కాంగ్రెస్ ఎంపీ

-మిగతా 2 లో





02

### పశ్చిమ బెంగాల్ పేరు 'పశ్చిమ బంగా'గా మార్పు?




02

### ఫ్రాన్స్‌ను వణికిస్తున్న బడిపిల్లలు

- పాఠశాలల్లో సౌకర్యాలు, టీచర్ల కొరతపై మహోద్యమం..
- ఒక్క పాఠశాలలో మొదలై దేశవ్యాప్తంగా విస్తరణ
- రోడ్లపైకి 4.5 లక్షల మంది విద్యార్థులు
- అణచివేతతో నిరసనలు హింసాత్మకం



02

### విద్యార్థులేమీ సంఘ విద్రోహ శక్తులు కాదు

- నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందన్న బాంబే హైకోర్టు
- ఎంఫీఎస్సీ పరీక్షల్లో లోపాలు, అక్రమాలపై ఆందోళనలు
- విద్యార్థులను సంఘ విద్రోహ శక్తులుగా చూడొద్దని వ్యాఖ్య
- పరీక్షల నిర్వహణలో పారదర్శకత అవసరమని స్పష్టీకరణ
- అక్రమాలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

### ఫ్రాన్స్ స్వాధీనానికి ప్రయత్నిస్తున్న ఇస్లాం

- అక్కడి విద్యార్థుల ఆందోళనలపై ట్రంప్ వ్యాఖ్య





02

# సర్ గో బ్యాక్.. జీకే గో బ్యాక్

### ఎస్ఐఆర్ ప్రక్రియపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు



- ప్రధాని ఆదేశాలతోనే ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపణ
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- రాహుల్, ప్రియాంకల నిర్బంధంపై సీఎం ఆగ్రహం
- ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామన్న రేవంత్
- కాంగ్రెస్ మాత్రమే కాదు.. ప్రజల ఉద్యమమని వ్యాఖ్య
- 'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్' నినాదం
- ఢిల్లీలో రాహుల్‌కు సంఘీభావం తెలిపిన సీఎం

**న్యూఢిల్లీ,**
దేశ ప్రజల ఓటు హక్కును హరించే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఆయన ఢిల్లీలో పర్యటించారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై పరిస్థితులపై చర్చించారు. అనంతరం రాహుల్‌గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్న బారాఖంబా రోడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆయనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని,

-మిగతా 2 లో



02

### జ్ఞానేశ్ రాజీనామాతోనే ఆగబోం

- ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన వరకు పోరాటం కొనసాగిస్తామన్న సీజేపీ
- సుదీర్ఘ ఉద్యమానికి సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపు
- అక్టోబర్ 10న ఢిల్లీకి రావాలని పౌరులకు విజ్ఞప్తి
- జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనకు ఏర్పాట్లు
- ఏఐఎస్ఏ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏపీ సంఘాల మద్దతు
- ఇండియా కూటమి ఎంపీల నిరసనకు విద్యార్థి సంఘాల సంఘీభావం
- ప్రజాస్వామ్య పరిరక్షణ శక్తులదే తమ పోరాటమన్న సౌరవ్ దాస్
- విపక్షాలు, కార్మికులు, విద్యార్థులు ఐక్యంగా పోరాడతారన్న నేహా బోరా




### ఉద్యోగులకు దసరా కానుక..

- రెండు డీఏలు విడుదల
- ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం
- అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం

**తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:**
దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరువు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం

-మిగతా 2 లో

TGTEL/26/A4846
నవ సంఘర్షణ
తెలుగు దినపత్రిక
www.navasangharshana.com



# రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ 'శాంతి సూత్రం'!



న్యూఢిల్లీ:
రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల తలెత్తే తక్షణ ముప్పులను తగ్గించే లక్ష్యంతో భారత్ మూడు అంశాలతో కూడిన కాల్పుల విరమణ ప్రణాళికను ప్రతిపాదించింది. కీలకమైన మౌలిక సదుపాయాలపై దాడులను నిలిపివేయడం, నిత్యావసర వస్తువుల సరఫరాను కొనసాగించడం, నల్ల సముద్రంలో వాణిజ్య నౌకల రాకపోకలకు రక్షణ కల్పించడం వంటి అంశాలపై ఈ ప్రతిపాదన దృష్టి సారిస్తుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇంధన సదుపాయాలు, ఇతర మౌలిక సౌకర్యాల కేంద్రాలపై దాడులను నిలిపివేయడం, నల్ల సముద్రం(బ్లాక్ సీ) ద్వారా ధాన్యం, ఇంధన రవాణా నిరంతరాయంగా సాగేలా చూడటం, అలాగే ఆ సముద్రంలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులకు ముగింపు పలకడం వంటి అంశాలను ఈ ప్రతిపాదన లక్ష్యంగా పెట్టుకుంది.

# భారత్‌లో స్టార్‌లింక్ రెడీ!

న్యూఢిల్లీ:
ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్టార్‌లింక్' భారత్‌లో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంది. దేశవ్యాప్తంగా 100 శాతం డిజిటల్ కనెక్టివిటీ సాధించాలనే ప్రధాని మోడీ ఆశయానికి మద్దతుగా నిలిచేందుకు భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లారెన్ డ్రేయర్ వెల్లడించారు.




ఇప్పటికే ఇన్-స్పేస్, శాటిలైట్ లైసెన్సుల నుంచి ప్రాథమిక అనుమతులు పొందిన స్టార్‌లింక్, ప్రస్తుతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) భద్రతా క్లియరెన్స్, కేంద్ర ప్రభుత్వ తుది ఆమోదం కోసం వేచి చూస్తోంది. సుదూర, గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడంలో స్టార్‌లింక్ శాటిలైట్ సాంకేతికత విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని కంపెనీ అభిప్రాయపడింది. భారతీయ భద్రతా అవసరాలు, నిబంధనలకు అనుగుణంగానే తమ కార్యకలాపాలను ప్రత్యేకంగా రూపొందించినట్లు స్టార్‌లింక్ స్పష్టం చేసింది. ముఖ్యంగా భారత వినియోగదారుల డేటాను దేశీయంగానే భద్రపరిచేలా ప్రతి దశలోనూ నియంత్రణ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా వందలాది యాంటెన్నాలతో కూడిన 20కి పైగా గేట్‌వే సైట్లను ఇప్పటికే నిర్మించామని పేర్కొంది.

# యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్

(మొదటి తరువాయి)

ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

# పశ్చిమ బెంగాల్ పేరు 'పశ్చిమ బంగా'గా మార్పు?



కోల్‌కతా
పశ్చిమ బెంగాల్ పేరును మారుస్తామని ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ సమిక్ భట్టాచార్య తెలిపారు. పశ్చిమ బెంగాల్‌ను 'పశ్చిమ బంగా'గా మార్చేందుకు త్వరలోనే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడుతామన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన భట్టాచార్యను కొందరు జర్నలిస్టులు పేరు మార్పుపై ప్రశ్నించారు.ఆయన స్పందిస్తూ.. 'ఎన్నిసార్లు చెప్పాలి. మేం కచ్చితంగా పేరు మార్చబోతున్నాం. మా ప్రభుత్వం తొలి అసెంబ్లీ సమావేశాల్లో ఇదే బిల్లు ఉంటుంది. ఈ రాష్ట్ర చరిత్రతో అనుబంధం ఉన్న పేరునే రాష్ట్రానికి పెట్టబోతున్నాం. ఇక నుంచి పశ్చిమ బంగ్లా, బంగ్లా అనే పేర్లు ఉండవు. కేవలం పశ్చిమ బంగా మాత్రమే ఉంటుంది. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ఈ పేరును పెట్టాలని నిర్ణయించాం' అని సమిక్ భట్టాచార్య వెల్లడించారు. గత సోమవారం కూడా ఆయన ఇదే తరహా ప్రకటన చేశారు.

# ఉద్యోగులకు దసరా కానుక..

(మొదటి తరువాయి)

నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. అంటే నవంబరు 1వ తేదీన ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ కానుంది. 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి వచ్చే వారికి ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడనుందని అంచనా. కేవలం బకాయిల చెల్లింపు కోసమే దాదాపు రూ. 6,174 కోట్లు అవసరమవుతాయి. తాజా పెంపుతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే వెల్లడించారు.

# ఢిల్లీ ఉద్రిక్తం

(మొదటి తరువాయి)

ప్రియాంక గాంధీ వాద్రా రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. తనను బలవంతంగా తరలించే ప్రయత్నం చేయడంపై ఆమె పోలీసుల తీరును ప్రశ్నించారు. ఎంపీలు ఎన్నికల కమిషనర్‌ను కలవాలనుకుంటే ఇలా అడ్డుకోవడం ఏమిటని నిలదీశారు. పోలీసులు తనను నేలపైకి తోసేశారని, మహిళా సిబ్బంది తనను గీరారని ఆమె ఆరోపించారు. కొద్దిసేపటి తర్వాత పోలీసులు ప్రియాంకను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ప్రియాంకను పోలీసులు తరలించే సమయంలో రాహుల్ గాంధీ సహా పలువురు నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. చివరకు రాహుల్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. తనను తరలిస్తున్న పోలీసులకు రాహుల్ నీళ్ల బాటిళ్లు అందించడం కూడా కనిపించింది. 'మీరు మీ పని చేస్తున్నారు' అంటూ పోలీసులతో ఆయన మాట్లాడారు. అంతకుముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు సమావేశమయ్యారు. అనంతరం జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించారు. ఎంపీలు ప్రయాణిస్తున్న బస్సులను జన్‌పథ్, అశోకా రోడ్ ప్రాంతంలో పోలీసులు నిలిపివేశారు. జంతర్ మంతర్ వద్ద ముందస్తు అనుమతి లేకుండా నిరసనకు అనుమతి లేదని పోలీసులు తెలిపారు. నిరసనకు కనీసం పది రోజుల ముందే సంబంధిత అధికారులకు దరఖాస్తు



చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తనపై నమోదైన కేసులపై స్పందించారు. తనపై ఇప్పటివరకు 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, అవి తనకు పతకాల వంటివని వ్యాఖ్యానించారు. తనపై 100 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే వరకు వెళ్లాలన్నది తన లక్ష్యమని అన్నారు. ఓటర్ల జాబితాల సవరణపై విపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇవి రాహుల్ గాంధీ చేసిన రాజకీయ వ్యాఖ్యలు, డిమాండ్లుగా చూడాలి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వెనక్కి తగ్గబోమని అన్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, చరణ్‌జీత్ సింగ్ చన్నీ, రేవంత్ చౌదరి తదితరులు కూడా పోలీసుల చర్యలను ప్రశ్నించారు. నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని పవన్ ఖేరా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, జంతర్ మంతర్ వద్ద నిరసనలకు ముందస్తు అనుమతి తప్పనిసరని ఢిల్లీ పోలీసులు మరోసారి స్పష్టం చేశారు. 2022లో జారీ చేసిన పోలీస్ స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం నిరసనలకు వేర్వేరు ప్రదేశాలు, పరిమితులు ఉన్నాయని తెలిపారు. జంతర్ మంతర్ పరిసరాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉందని వెల్లడించారు. ఎంపీలతో వ్యవహరించే సమయంలో ప్రోటోకాల్ పాటిస్తూ గౌరవప్రదంగా వ్యవహరించాలని భద్రతా సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. మరోవైపు అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద సీపీఎం, విద్యార్థి సంఘాలు కలిసి నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించాయి. ఈ మేరకు ఢిల్లీ పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీపీఎం ప్రతినిధులు ప్రకటించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎఐఎస్ఎ జాతీయ అధ్యక్షురాలు నేహా వోరా పిలుపునిచ్చారు.

# విద్యార్థులేమీ సంఘ విద్రోహ శక్తులు కాదు

**నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందన్న బాంబే హైకోర్టు**

**ఎంపీఎస్సీ పరీక్షల్లో లోపాలు, అక్రమాలపై ఆందోళనలు**

**విద్యార్థులను సంఘ విద్రోహ శక్తులుగా చూడొద్దని వ్యాఖ్య**

**పరీక్షల నిర్వహణలో పారదర్శకత అవసరమని స్పష్టీకరణ**

**అక్రమాలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే**

ముంబై, అక్టోబరు 7



మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంఎస్సీఎస్సీ) నిర్వహించిన పరీక్షల్లో లోపాలు, అక్రమాలను ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థులు సంఘ విద్రోహ శక్తులు కాదని, తమ సమస్యలపై నిరసన తెలిపే హక్కు వారికి ఉందని స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కోర్టు పేర్కొంది. విద్యార్థుల ఆందోళనలకు వ్యతిరేకంగా పుణెకు చెందిన కొంతమంది స్థానికులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పరీక్షల్లో తలెత్తిన సమస్యలను ప్రశ్నిస్తూ విద్యార్థులు చేపడుతున్న నిరసనలను చట్టబద్ధమైన హక్కుల పరిధిలో చూడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రభుత్వ యంత్రాంగం పరీక్షల నిర్వహణలో లోపాలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

# సర్ గో బ్యాక్.. జీకే గో బ్యాక్

(మొదటి తరువాయి)

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున్ ఖర్గే తదితర నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. ఇది ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా కాంగ్రెస్ అభివర్ణిస్తోందని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటం అరెస్టులు, కేసులతో ఆగదని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్, జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా అంశాలపై ప్రతిపక్షాల ఆందోళనలు ఢిల్లీలో కొనసాగుతున్నాయి. ప్రజల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సంబంధించిన ఉద్యమం కాదని, ఇండియా కూటమి, ప్రజల భాగస్వామ్యంతో సాగుతున్న పోరాటమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడేందుకు వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. గతంలో స్వాతంత్ర్యోద్యమంలో వినిపించిన 'సైమన్ గో బ్యాక్' నినాదాన్ని ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం 'సర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' నినాదాలు వినిపిస్తున్నాయని అన్నారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం, కేంద్రంలోని అధికార పక్షం ఖండిస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై రాజకీయ వివాదం మరింత తీవ్రతరమైంది.

# జ్ఞానేశ్ రాజీనామాతోనే ఆగబోం

న్యూఢిల్లీ,



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో చేపట్టిన ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీజేపీ, పలు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. కేవలం సీఈసీ రాజీనామాతో ఉద్యమం ఆగదని, ఎన్నికల వ్యవస్థలో ప్రక్షాళన జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపాయి. సుదీర్ఘ ఉద్యమానికి సిద్ధం కావాలని కార్యకర్తలు, విద్యార్థులకు పిలుపునిచ్చాయి. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సీజేపీ ఈ నెల 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టనుంది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఏ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఏపీ తదితర విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం నిర్వహించిన నిరసనకు సంఘాలు మద్దతు తెలిపాయి. సీజేపీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. ఈ నెల 10న దేశ పౌరులు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి రావాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటం త్వరగా ముగిసేది కాదని, లక్ష్య సాధనకు సుదీర్ఘ సమయం పట్టవచ్చని అన్నారు. ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా మాట్లాడుతూ.. విపక్షాలు, విద్యార్థుల ఆందోళనలను వేర్వేరుగా చూడొద్దని కోరారు. దేశ ప్రజలు, విపక్షాలు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు కలిసి ఎన్నికల వ్యవస్థపై పోరాటం కొనసాగిస్తాయని తెలిపారు.ప

# ఫ్రాన్స్‌ను వణికిస్తున్న బడిపిల్లలు

**-పాఠశాలల్లో సౌకర్యాలు, టీచర్ల కొరతపై మహోద్యమం..**

**- ఒక్క పాఠశాలలో మొదలై దేశవ్యాప్తంగా విస్తరణ**

**-రోడ్లపైకి 4.5 లక్షల మంది విద్యార్థులు**

**-అణచివేతతో నిరసనలు హింసాత్మకం**




ప్యారిస్,
ఫ్రాన్స్‌ను పాఠశాల విద్యార్థులు వణికిస్తున్నారు. జెన్ ఆల్ఫా దెబ్బకు అక్కడి ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఒక్క పాఠశాలలో ప్రారంభమైన నిరసన.. దావానలంలా దేశం మొత్తాన్ని చుట్టుముట్టింది. ప్రభుత్వాన్నే కదిలిస్తున్న ఈ ఉద్యమకారులంతా 15-18 ఏళ్లలోపు వారే. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ సోషల్‌మీడియా వేదికలనే ప్రధాన ప్రచార మాధ్యమాలుగా చేసుకొని దేశం నలుమూలలా వీధులను ముంచెత్తుతున్నారు. ఉద్యమంపై ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రభుత్వం కఠిన అణచివేతకు దిగింది. ఇప్పటివరకు దాదాపు 6వేల మందిని అరెస్టు చేసింది. దీంతో ఉద్యమం తీవ్రంగా, హింసాత్మకంగా మారింది.

ఇలా మొదలైంది..

ఫ్రాన్స్‌లో పాఠశాల విద్యలో వివిధ స్థాయిలు ఉంటాయి. 3-6 ఏళ్ల పిల్లలు చదివే పాఠశాలను ఎకోల్ మాటెర్నెల్ (కిండర్‌గార్డెన్) అంటారు. 1నుంచి 5వ తరగతి వరకు ఉండే పాఠశాలను ఎకోల్ ఎలిమెంటైర్ అంటారు. 6 నుంచి 9 తరగతుల పాఠశాలను కాలేజ్ అంటారు. 10 నుంచి 12వ తరగతి వరకు ఉన్న పాఠశాలను లీసే అంటారు. ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్న ఉద్యమం చేస్తున్న విద్యార్థులంతా ఈ లీసే స్థాయివారే. ఫ్రాన్స్‌లో 3,700 లీసే పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఎక్కువశాతం పాత భవనాల్లో అంతంత మాత్రం సౌకర్యాలతోనే నడుస్తున్నాయి. ప్రధాన నగరాల్లో ధనికుల పిల్లలు చదివే పాఠశాలల్లో మాత్రమే మంచి సౌకర్యాలు ఉన్నాయి. ఒక్కో క్లాసులో 32 నుంచి 35 మంది విద్యార్థులు ఉంటారు. ఈ స్కూళ్లలో టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. ఈ సమయంలోనే ఫ్రాన్స్ ప్రభుత్వం ఆర్థిక పొదుపు చర్యల్లో భాగంగా టీచర్ల మూలవేతనాల్లో కోత విధించాలని నిర్ణయించింది.

# ఫ్రాన్స్ స్వాధీనానికి ప్రయత్నిస్తున్న ఇస్లాం

వాషింగ్టన్,



: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఫ్రాన్స్‌లోని విద్యార్థుల నిరసనలు ఆ దేశ సామూహిక వలసలు, దేశాన్ని ఇస్లాం తమ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుకుంటున్న ప్రగాఢ కాంక్షను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. 'ఫ్రాన్స్‌లో జరుగుతున్నది అదుపుతప్పిన వలసలు తప్ప మరేమీ కాదు. ఇది పాఠశాలలకు సంబంధించిన సమస్య కాదు. ఒక గొప్పదేశాన్ని ఇస్లాం ఆధీనంలోకి తీసుకోవాలన్న కాంక్షకు సంబంధించిన విషయం' అని ఆయన ట్రూత్ సోషల్‌లో తెలిపారు. సౌకర్యాల లేమి, టీచర్ల కొరతను నిరసిస్తూ ఫ్రాన్స్‌లోని 15-17 ఏండ్ల విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే.

లాస్ ఏంజెలెస్, శాన్ డియాగోను ఇరాన్ నాశనం చేయనివ్వండి!కాలిఫోర్నియా నగరాలైన లాస్ ఏంజెలెస్, శాన్ డియాగో గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీలోనే విమర్శలకు దారితీశాయి. ఇరాన్‌కు అణ్వాయుధాన్ని దక్కకుండా చేయడానికి అమెరికన్లు త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని నెబ్రాస్కాలో జరిగిన మధ్యంతర ఎన్నికల ర్యాలీలో ట్రంప్ చెప్పిన ఒక రోజు తర్వాత మంగళవారం ఆయన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తింది. ప్రపంచాన్ని, మన దేశాన్ని సురక్షితంగా ఉంచడానికి ఇది చాలా చిన్న మూల్యం అని ట్రంప్ అన్నారు. ఇంధన, ఎరువుల ధరల పెరుగుదల సహా యుద్ధం వల్ల కలిగే పర్యవసానాలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్య చేసినట్టు కనిపిస్తున్నది.ట్రంప్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వారు(ఇరాన్) ఒక నగరాన్ని నాశనం చేయగలరు. లాస్ ఏంజెలెస్‌ను నాశనం చేయనివ్వండి. శాన్ డియాగోను నాశనం చేయనివ్వండి. ఇది చెల్లించాల్సిన చాలా చిన్న మూల్యం. పైగా ఇది చాలా త్వరగా ముగిసిపోతుంది అని పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సమకూర్చుకునేందుకు అనుమతిస్తే అది అమెరికా నగరాలపై దాడి చేయగలదని ట్రంప్ వ్యాఖ్యల్లోని అర్థమని వైట్‌హౌస్ తెలిపింది. అయితే దేశంలోని కొన్ని నగరాలను వదిలేయవచ్చని లేదా వాటిని త్యాగం చేయవచ్చని అధ్యక్షుడు సూచించారని కొందరు డెమోక్రాట్లు సహా రిపబ్లికన్లు ఆరోపించారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు ,చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన గాంధీ.

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 07 నవ సంఘర్షణ**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జలమండలి ఈడీ సంతోష్ రెడ్డి , జీఎం కృష్ణ, జీఎం హరిశంకర్ తాజా మాజీ కార్పొరేటర్లు, రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాస రావు , ఉప్పలపాటి శ్రీకాంత్ గారు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి మరియు జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం జరిపిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.



ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. మంచి నీటి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ, పనితీరు పై అధికారులతో చర్చించడం జరిగినది.ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే విధంగా జలమండలి అధికారులు సమన్వయంతో పని చేయాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల వాసుల నుండి వచ్చిన వినతి పత్రాలను పరిగణలోకి తీసుకొని అత్యవసర పనుల పై తక్షణమే స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రతి ఫిర్యాదు పై స్పందించాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండలని , ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని,ప్రజలకు ఎల్లవేళలో అందుబాటులో అధికారులు ఉండలని తెలియచేసారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా లో అంతరాయం లేకుండా చూడలని, ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీరు అందించాలని, కలుషితం కలుగకుండా చూడలని, స్వచ్ఛమైన త్రాగు నీరు అందించాలని, మంచి నీటి సరఫరా లో ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియచేసారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమగ్ర , సంతులిత అభివృద్ధి లో భాగంగా ప్రతి డివిజన్ల లో మౌళికవసతుల కల్పన కొరకై ప్రతి డివిజన్ లో అవసరమైన ప్రతిపాదనలు తీసుకోవడం జరిగినది అని, కాలనీలలో అవసరమైన చోట అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్, మంచి నీటి పైప్ లైన్ పనుల కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని , పనులు త్వరిత గతిన చేపట్టాలని, అత్యవసర పనుల ను గుర్తించి,ప్రథమ ప్రాధాన్యత గా పనులు గుర్తించి త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియచేసిన అదేవిధంగా అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతి పై సమీక్షా జరపడం జరిగినది. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలియచేసారు.
మురుగు నీరు పొంగకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజి వ్యవస్థ పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని , ఎక్కడ పొంగి పొర్లకుండా చూడలని,పైప్ లు మిగిలిపోయిన చోట మార్చాలని అవసరమున్న చోట కొత్త ప్రతిపాదనలు తీసుకోవాలని, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్తగా చేపట్టాల్సిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ మరియు మంచి నీటి పైప్ లైన్ కొరకు ప్రతిపాదనలు తీసుకోవాలని, పనులు ప్రథమ ప్రాధాన్యత గుర్తించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని , విధులలో అలసత్వం ప్రదర్శించకూడదు అని , ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని అధికారులకు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డిజీఎం శ్రీమాన్ నారాయణ,డిజీఎం శ్రీనివాస్ రాజు, డిజీఎం నరేందర్, డిజీఎం శ్రీహరి,మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# రూ.1,50,000/- ఒక లక్ష యాభై వేల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీ ని అందచేసిన పియేసి చైర్మన్ ఆకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 07 నవ సంఘర్షణ**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీకి చెందిన తోట వెంకట రమణ కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 1,50,000/- ఒక లక్ష యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన ఎల్వోసీ మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ ముదిరాజు, నాయి నేని చంద్రకాంత్ రావు,ప్రసాద్,తిరుపతి, అవుల రవిందర్,క్రిష్ణాంక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా విద్యను అభ్యసించాలి

**-షాద్ నగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి**

**-కందివనం కేజీబీవీలో పోషణ్ మా కార్యక్రమం**

**-జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి..**

**సమతుల్య ఆహారంతో ఆరోగ్యంగా ఎదగాలి**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 07 నవ సంఘర్షణ**
విద్యార్థినులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి, పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని షాద్ నగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సూచించారు. సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కందివనం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక -- శారీరక ఆరోగ్యం, విద్యాభ్యాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థినులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి, పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తగ్గించి, వాటికి దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంచుకునేందుకు ప్రతిరోజూ తగిన వ్యాయామం, శారీరక కదలికలు అలవాటు చేసుకోవాలని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిశుభ్రమైన ఆహారం, నీటిని తీసుకోవాలని విజయలక్ష్మి సూచించారు. ప్రతి విద్యార్థిని తన జీవితానికి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, ఆ లక్ష్య సాధన దిశగా క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఆమె తెలిపారు. చదువుతో పాటు ఆరోగ్యం, మంచి అలవాట్లు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్పలత, ఆశా కార్యకర్త సునీత, పాఠశాల ఉపాధ్యాయులు గౌరీ, మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి

**ఆంగోత్ వెంకటేష్ పవార్**

**హైదరాబాద్( అక్టోబర్ 7) నవ సంఘర్షణ**



ఓట్ల సవరణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారంటూ,కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండియా కూటమి ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్ (రాజ్‌భవన్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆంగోత్ వెంకటేష్ పవార్ తెలిపారు.ఉదయం 10 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు భారీ ప్రదర్శన, అనంతరం సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్తో పాటు ఇండియా కూటమి నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వెంకటేష్ పవార్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని చలో లోక్‌భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదు





**- డా.టి. రితిక్ రెడ్డి**

**నవ సంఘర్షణ పరిగి అక్టోబర్ 07**
ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని యువ నాయకుడు, డా. టి. రితిక్ రెడ్డి అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని టీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరిగి పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే, డా. టి. రామ్మోహన్ రెడ్డి హాజరై స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి హెల్మెట్లను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా డా. టి. రితిక్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత కీలకమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఒక రోడ్డు ప్రమాదం వల్ల ఒక్క వ్యక్తి మాత్రమే కాకుండా ఆ కుటుంబం మొత్తం తీవ్రంగా నష్టపోతుందని పేర్కొన్నారు. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తన జన్మదినం సందర్భంగా హెల్మెట్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. "ప్రజల ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదు" అని అన్నారు.
ప్రజల సంక్షేమం కోసం టీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని డా. రితిక్ రెడ్డి తెలిపారు.

# ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో ప్రచారం చేసిన టీఆర్పీ




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 07 నవ సంఘర్షణ**
తెలంగాణ ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా బహుజన వర్కర్స్ యూనియన్ కత్తెర గుర్తుకు ఓటు వేయమని షాద్నగర్ బస్ స్టేషన్ లో షాద్నగర్ నియోజకవర్గం అధ్యక్షులు ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్ గారు మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్న గారి నాయకత్వంలో బహుజన వర్కర్స్ యూనియన్ తో కొత్త నాయకత్వం ప్రశ్నించే గొంతుకైనటువంటి తీన్మార్ మల్లన్న ఆశయాలతో ఆర్టీసీ కార్మికులకు వారి యొక్క డిమాండ్లను ప్రభుత్వంతో పోరాడి సాధించుకుంటాం అని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మికులారా ఒక్కసారి ఆలోచించండి మోసగించే ప్రభుత్వాలకు కొమ్ముకాసే నాయకుల వెంట వెళితే నష్టం తప్పదని మీ న్యాయ మైన హక్కుల కోసం పోరాడే గొంతుకకు తోడ్పాటు అవ్వండని కోరారు ఈ కార్యక్రమంలో ఫరుక్ నగర్ మండల అధ్యక్షులు ఆవ జగన్, షాద్నగర్ మున్సిపాలిటీ అధ్యక్షులు ఉప్పర మౌని రాములు, షాద్నగర్ ౧౯ా నాయకులు గుల్ల హరిప్రసాద్, గడీల అంజయ్య, ఆర్టీసీ యూనియన్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## అమెరికా కనుసన్నల్లో గ్రీన్‌ల్యాండ్




డొనాల్డ్ ట్రంప్ తన మొదటి అధ్యక్ష పదవీ కాలంలో డెన్మార్క్ ఆధీనం లోని గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవచ్చనే ఆకాంక్షను మొదటిసారి ప్రస్తావించారు. 2025 జనవరిలో తిరిగి వైట్‌హౌస్‌కు వచ్చిన తర్వాత కూడా ఆయన గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం విషయమై మరింత గట్టిగా మాట్లాడారు. 'ఎలాగైనా గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా భూభాగంగా చేసుకుంటాం' అని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు నాటోలో వ్యవస్థాపక సభ్యదేశమైన డెన్మార్క్‌తోపాటు, యూరప్ లోని అమెరికా మిత్రదేశాల్లో కూడా తీవ్ర అసంతృప్తిని కలిగించాయి. దీనికి ప్రతిస్పందనగా గ్రీన్‌ల్యాండ్‌పై తన సార్వభౌమాధికారాన్ని డెన్మార్క్ మళ్లీ స్పష్టం చేసింది. అయితే ఒక రాజీగా, గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికా తన సైనిక ఉనికిని మరింత విస్తరించడానికి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చింది. సెప్టెంబర్ 22న అమెరికా, డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ నాయకులు ఒక కొత్త భద్రతా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం 'గ్రీన్‌ల్యాండ్‌లో అవసరమైన చర్యలు తీసుకునేందుకు' అమెరికాకు అవకాశం ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైతే సైనిక బలాన్ని ఉపయోగిస్తామని ట్రంప్ గతంలో బెదిరించినప్పటికీ, ఇప్పుడు స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్‌నుంచి కొంత వెనక్కి తగ్గినట్టు కనిపిస్తుంది. అదే సమయంలో అమెరికా గ్రీన్‌ల్యాండ్‌కు ప్రధాన భద్రతా రక్షణదారుగా ఉండే పాత్రను మరోసారి బలపరుస్తుంది. ప్రస్తుతం అమెరికా గ్రీన్‌ల్యాండ్ లోని పిటుఫిక్ స్పేస్‌బేస్‌లో సుమారు 150 మంది సైనికులను మోహరించింది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా దక్షిణ గ్రీన్‌ల్యాండ్‌లోని నార్సర్సువాక్ ప్రాంతంలో సైనిక సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో అక్కడ అమెరికాకు ఒక వైమానిక స్థావరం ఉండేది. అలాగే తూర్పు ప్రాంతం లోని మాస్టర్స్‌విగ్‌లో కూడా సైనిక సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. 1951 లో అమెరికా డెన్మార్క్ మధ్య కుదిరిన భద్రతా ఒప్పందం ప్రకారం మంచుతో కప్పబడి ఉన్న గ్రీన్‌ల్యాండ్‌లో సైనిక స్థావరాలను నిర్మించడానికి అమెరికాకు విస్తృత హక్కులు లభించాయి. రెండో ప్రపంచ యుద్ధం, ప్రచ్ఛన్న యుద్ధం కాలంలో అమెరికా గ్రీన్‌ల్యాండ్‌తో 30 కి పైగా సైనిక స్థావరాలు, ఇతర సైనిక కేంద్రాలను కలిగి ఉండేది. అయితే ముఖ్యంగా ప్రచ్ఛన్న యుద్ధం (కోల్డ్ వార్) ముగిసిన తరువాత వాటిలో చాలావరకు మూతపడ్డాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఆర్కిటిక్ ప్రాంతంలో చైనా, రష్యా కార్యకలాపాలు పెరుగుతున్నాయని, గూఢచర్య కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ట్రంప్ పరిపాలనా అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. మంచు కరుగుతున్న కారణంగా గతంలో చేరుకోవడం కష్టమయ్యే ప్రాంతాలు ఇప్పుడు అందుబాటు లోకి వస్తుండటంతో ఆర్కిటిక్ ప్రాంతం వ్యూహాత్మకంగా మరింత ముఖ్యమవుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా ఆ ప్రాంతంలో తన వ్యూహాత్మక స్థితిని బలోపేతం చేసుకోవాలని కోరుకుంటోంది. ఈ వ్యూహంలో గ్రీన్‌ల్యాండ్ కీలక పాత్ర పోషిస్తుందని అమెరికా భావిస్తోంది. ఆ ఒప్పందం ప్రకారం సుమారు 50,000 మంది జనాభా ఉన్న గ్రీన్‌ల్యాండ్ భవిష్యత్తులో స్వతంత్ర దేశంగా మారినా, అమెరికాతో చేసుకున్న ఒప్పందాన్ని గౌరవిస్తూ నాటోలోనే కొనసాగుతుంది. మరో మాటలో చెప్పాలంటే, ఈ ఒప్పందం ద్వారా గ్రీన్‌ల్యాండ్ లోని సైనిక స్థావరాలను అమెరికా నిరవధికంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. అలాగే నాటోలో లేని శత్రు లేదా ప్రత్యర్థి దేశాలు గ్రీన్‌ల్యాండ్‌లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేయకూడదని, అలాగే గ్రీన్‌ల్యాండ్ లోని సున్నితమైన రంగాల్లో ప్రధానంగా అరుదైన ఖనిజాలు పెట్టుబడులు పెట్టకూడదని, ఈ ఒప్పందం నిర్దేశిస్తుంది. డెన్మార్క్ ఇప్పటికే గ్రీన్‌ల్యాండ్‌లో చైనా పెట్టుబడులను అడ్డుకుంది. ఈ ఒప్పందం ఆ పరిమితిని అధికారికంగా స్థిరపరిచినట్టవుతుంది. అందువల్ల ఒప్పందం కాగితాలపై చూస్తే గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్ రాజ్యంలో స్వపరిపాలన కలిగిన స్వయం ప్రతిపత్తి ప్రాంతంగా కొనసాగవచ్చు. అదే సమయంలో, అమెరికా దాని ప్రధాన వ్యూహాత్మక రక్షణ భాగస్వామిగా ఉండి, గ్రీన్‌ల్యాండ్‌పై గణనీయమైన వ్యూహాత్మక ప్రభావాన్ని కలిగి ఉంటుంది. వాషింగ్టన్, నాటో, డెన్మార్క్‌లకు ఆమోదయోగ్యంగా ఉండే ఒక దౌత్యపరమైన ఏర్పాటుగా ఇది కనిపిస్తుంది. గ్రీన్‌ల్యాండ్ ద్వీపానికి ఒకవైపు అట్లాంటిక్, మరోవైపు ఆర్కిటిక్ జలాలు చుట్టుముట్టి ఉన్నాయి. వాతావరణ మార్పులకు, భూతాపానికి, ఆర్కిటిక్ సముద్రం లోని హిమానీ నదులు, మంచు ఫలకాలు కరుగుతుంటాయి. దీనివల్ల నౌకా రవాణాకు కొత్త మార్గాలు ఏర్పడుతుంటాయి. దీంతో సముద్ర వాణిజ్యం విస్తరించడానికి ఎక్కువగా వీలవుతుందని అమెరికా ఆశ పడుతోంది. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతుండడంతో ఆర్కిటిక్ జలాల్లో నూతన నౌకా రవాణా మార్గాలను అభివృద్ధి చేయడానికి రష్యా, చైనా దేశాలు కూడా ఆరాటపడుతున్నాయి. కానీ ఇప్పటి కొత్త ఒప్పందంతో ఆ దేశాల ప్రయత్నాలు సాగకపోవచ్చు. ఇదిలా ఉండగా గ్రీన్‌ల్యాండ్‌లో 35 కీలకమైన ఖనిజాల్లో 25 ముడి ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయని 2025లో నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. ఎలక్ట్రిక్, వాహనాలు, బ్యాటరీల్లో ఈ ఖనిజాలను వినియోగిస్తారు. అలాగే గ్రీన్‌ల్యాండ్ మంచు ఫలకలు కరుగుతుండడంతో చమురు, గ్యాస్, ఇతర కీలకమైన ఖనిజాలను తవ్వి తీయడం సులువవుతుంది. దీంతో చైనాకు గట్టిపోటీ ఇవ్వగలుగుతామని అమెరికా భావిస్తోంది. మొత్తం మీద గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం సంగతి ఎలా ఉన్నా ఒప్పందంతో అనేక లాభాలు కలుగుతాయని అమెరికా ఆశిస్తోంది.

# యూపీఐ చెల్లింపుల వెనుక ఖర్చెవరిది?



భారతదేశంలోని డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌స్పేస్ (యూపీఐ) ఒక విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. ఒక క్యూఆర్ కోడ్‌తో క్షణాల్లో డబ్బు చెల్లించవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఎలాంటి రుసుము లేకపోవడం యూపీఐ విస్తరణకు ప్రధాన కారణాల్లో ఒకటి. అయితే అధిక విలువ కలిగిన కొన్ని వ్యాపార లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయం యూపీఐ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తున్నది. 2026 అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన నిర్దిష్ట వ్యాపార లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తించనున్నది. ఇకపై యూపీఐ వాడిన ప్రతిసారీ వినియోగదారుడు రుసుము చెల్లించాల్సి వస్తుందని కాదు. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి చేసే చెల్లింపులు ఉచితంగానే ఉంటాయి. అలాగే రూ.2,000 వరకు చేసే వ్యాపార చెల్లింపులపైనా ఈ రుసుము ఉండదు. క్యూఆర్ కోడ్ ద్వారా యూపీఐ చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా కొన్ని రక్షణలు కల్పించారు.

కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం దాదాపు 96 శాతం వ్యాపార లావాదేవీలు ఈ కొత్త రుసుము పరిధిలోకి రావు. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ఎండీఆర్ అనేది వినియోగదారుడిపై నేరుగా విధించే పన్ను కాదు. వ్యాపారి డిజిటల్ చెల్లింపును స్వీకరించడానికి చెల్లించే వ్యవస్థాపక రుసుము. ఉదాహరణకు రూ.10,000కు సంబంధించిన లావాదేవీపై 0.4 శాతం రుసుము అంటే రూ.40 అవుతుంది. కొన్ని లావాదేవీలకు గరిష్ఠ పరిమితులు, కొన్ని ముఖ్యమైన రంగాలకు ప్రత్యేక రేట్లు కూడా ఉన్నాయి.

ఈ మార్పు వెనుక ఆర్థిక కారణం కూడా ఉన్నది. యూపీఐ వినియోగదారుడికి ఉచితంగా కనిపించినప్పటికీ, దాన్ని నిర్వహించడం మాత్రం ఉచితం కాదు. బ్యాంకులు, చెల్లింపు సంస్థలు సర్వర్లు, సైబర్ భద్రత, మోసాల నివారణ, సమాచార వ్యవస్థల నిర్వహణ, వినియోగదారుల సేవల కోసం నిరంతరం ఖర్చు చేయాలి. 2026 ఆగస్టులోనే యూపీఐ ద్వారా సుమారు రూ.2,400 కోట్ల లావాదేవీలు జరిగాయి. వాటి మొత్తం విలువ దాదాపు రూ.27.7 లక్షల కోట్లు. ఇప్పటివరకు జీరో ఎండీఆర్ విధానాన్ని ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాల ద్వారా కొనసాగించింది. దీని వల్ల చిన్న దుకాణదారుడు కూడా ఎలాంటి లావాదేవీ రుసుము గురించి ఆలోచించకుండా యూపీఐ చెల్లింపులను స్వీకరించగలిగాడు. అయితే యూపీఐ వినియోగం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఈ మొత్తం వ్యవస్థ నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే భరించాలా? కొత్త మార్గాలను అన్వేషించడం అవసరమా అనే చర్చ జరుగుతున్నది. యూపీఐ చెల్లింపులపై రుసుము విధించడంపై రాజకీయ వివాదం కూడా ఉన్నది. అమెరికా ఒత్తిడి, అంతర్జాతీయ చెల్లింపు సంస్థల ప్రయోజనాల కారణంగానే ఈ మార్పు తీసుకొచ్చారని ప్రతిపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు. వీసా, మాస్టర్ కార్డ్ వంటి అంతర్జాతీయ చెల్లింపు సంస్థలు సాధారణంగా వ్యాపారుల నుంచి రుసుములు వసూలు చేసే విధానంలో పనిచేస్తాయి. దీనికి భిన్నంగా భారతదేశం యూపీఐని దాదాపు జీరో రుసుముతో అభివృద్ధి చేసింది. రాజకీయ వివాదాల సంగతి పక్కనపెడితే అసలు ఆందోళన మాత్రం చిన్న వ్యాపారులపై పడే ప్రభావం. పెద్ద వ్యాపార సంస్థ ఒక చిన్న రుసుమును భరించగలిగినా, తక్కువ లాభాలతో నడిచే చిన్న దుకాణదారుడికి అది భారంగా మారుతుంది. వ్యాపారి ఆ ఖర్చును తన లాభంలో నుంచి భరించవచ్చు, లేక పోటీ పరిస్థితులను బట్టి వస్తువులు, సేవల ధరల్లో పరోక్షంగా సర్దుబాటు చేయవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఈ రుసుమును వేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ, ఆ నిబంధన అమలు ఎలా జరుగుతుందన్నది కీలకం. అందువల్ల యూపీఐపై చర్చను 'ఇక నుంచి చెల్లింపులకు రుసుము' అనే సరళమైన ప్రశ్నకు పరిమితం చేయకూడదు. యూపీఐ విజయానికి కారణమైన సరళత, తక్కువ వ్యయం, ప్రజల నమ్మకం దెబ్బతినకుండా, ఈ భారీ డిజిటల్ మౌలిక వ్యవస్థను దీర్ఘకాలం ఆర్థికంగా నిలకడగా ఎలా నిర్వహించాలన్నదే అసలు ప్రశ్న. యూపీఐని కోట్లాది ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన నమూనాను కాపాడుతూనే, దాని నిర్వహణ ఖర్చును ఎవరు, ఎంతవరకు భరించాలి? ఈ ప్రశ్నకు సమతుల్యమైన సమాధానమే భవిష్యత్తులో యూపీఐ విజయాన్ని నిర్ణయిస్తు

# ఓటుకు భరోసా ఎవరు?

ఓటు ప్రజాస్వామ్యంలో ఒక సాధారణ గుర్తు కాదు. అది పౌరుడి రాజకీయ హక్కుకు, సమానత్వానికి, పాలనలో భాగస్వామ్యానికి ప్రతీక. అందుకే ఓటర్ల జాబితా రూపకల్పన నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశపై ప్రజలకు విశ్వాసం ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రాథమిక అవసరం. ఆ విశ్వాసం దెబ్బతింటే సమస్య ఒక పార్టీకి, ఒక ఎన్నికకు లేదా ఒక అధికారికి మాత్రమే పరిమితం కాదు. అది మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన ప్రశ్నగా మారుతుంది. అసలు ప్రజాస్వామ్య ప్రశ్న-'సర్' ప్రక్రియ ఎంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా, ప్రజలు స్వయంగా ధ్రువీకరించగలిగే విధంగా కొనసాగుతున్నది అనేదే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ఎన్నికల పర్యవేక్షణ, నియంత్రణ, దిశానిర్దేశం వంటి విస్తృత బాధ్యతలను ఎన్నికల సంఘానికి అప్పగించింది. ఎన్నికల సంఘం కూడా తనను స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా పేర్కొంటున్నది. ఈ అధికారంతోపాటు ప్రజల విశ్వాసాన్ని కాపాడే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నికల సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ వ్యవహరించకూడదు. రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియలో ప్రాథమిక హక్కులు, రాజకీయ స్వేచ్ఛ వంటి అంశాలపై జరిగిన చర్చలు మన ప్రజాస్వామ్య దృక్పథానికి పునాది వేశాయి.

నేటి చర్చ కేవలం ఒక ఎన్నికల కమిషనర్ వ్యక్తిగత వ్యవహారం కాదు. ఇది ఎన్నికల సంస్థాగత స్వతంత్రత, పౌరుడి ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసానికి సంబంధించిన ప్రశ్న. ఎస్ఐఆర్‌పై వచ్చిన ఆరోపణలను అవి రాజకీయ ఆరోపణలేనని వెంటనే కొట్టిపారేయడం సరికాదు.



ప్రజాస్వామ్యానికి సరైన మార్గం-ఆరోపణలను ఆధారాలతో పరీక్షించడం, ఫలితాలను ప్రజల ముందుంచడం. ఏ ప్రాంతంలో ఎంతమంది ఓటర్లు తొలగింపునకు గురయ్యారు? కారణాలేంది? ఎంతమంది కొత్త ఓటర్లుగా చేరారు? సంబంధిత వ్యక్తులకు నోటీసులు, అభ్యంతరాలు, అప్పీల్‌కు తగిన అవకాశాలు కల్పించారా? తుది జాబితాలో ఎన్ని మార్పులు జరిగాయి? ఈ ప్రశ్నలకు స్పష్టమైన గణాంకాలతో సమాధానాలు రావాలి. ఇది ఎన్నికల సంఘాన్ని బలహీనపరుచడం కాదు. ప్రజలకు సమాచారాన్ని అందించడం ద్వారా దాని విశ్వసనీయతను బలోపేతం చేయడం.

ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేస్తే సమస్య మొత్తం పరిష్కారమవుతుందని భావించడం కూడా సరైంది కాదు. ఒక వ్యక్తి స్థానంలో మరొకరు రావడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోవు. వ్యక్తి మార్పు కంటే వ్యవస్థాగత జవాబుదారీతనం ముఖ్యం. అదే సమయంలో రాజ్యాంగ సంస్థపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు మౌనం సమర్థవంతమైన సమాధానం కాదు. ప్రజలకు వివరణ ఇవ్వడం సంస్థ బలహీనత కాదు; అది ప్రజాస్వామ్య బాధ్యత. ప్రజా నిరసనలను పక్కదారి పట్టించేందుకు ఇతర అంశాలను ముందుకు తేవడం కంటే, ప్రజా ప్రాముఖ్యత కలిగిన ప్రశ్నలకు ప్రత్యక్షంగా సమాధానం ఇవ్వడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య పద్ధతి. అదే సమయంలో ఆధారాలతో ప్రజల ముందుంచాలి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికే కాదు-విమర్శించే ప్రతి వర్గానికి ఆధారబద్ధత, బాధ్యత అవసరం. 'సర్'పై వచ్చిన ఆరోపణల ను స్వతంత్రంగా, పారదర్శకంగా, ఆధారాలతో పరిశీలించాలి. అవసరమైతే ఓటర్ల జాబితాలపై నియోజకవర్గాల వారీగా ఆడిట్ నిర్వహించాలి. ఎన్నికల కమిషన్ మౌనం సమాధానం కాదు. తీర్పు కూడా కాదు. ప్రజాస్వామ్యానికి అవసరమైనది వ్యక్తులపై అంధ విశ్వాసం కాదు-వ్యవస్థలపై ప్రజల నమ్మకం. ఆ నమ్మకానికి పునాది పారదర్శకత, స్వతంత్రత, జవాబుదారీతనం. ఓటరు తన పేరు ఓటర్ల జాబితాలో ఉన్నదని, తన ఓటు తనదేనని, అది సక్రమంగా లెక్కించిందని విశ్వసించినప్పుడే ఎన్నిక ప్రజల తీర్పుగా నిలుస్తుంది. ఆ విశ్వాసాన్ని కాపాడటం ఎన్నికల సంఘం తక్షణ బాధ్యత.

# తేజాస్ యుద్ధ విమానాలకు అదనపు శక్తి..

## అమెరికా నుంచి వచ్చిన 4 జీఈఎఫ్404 ఇంజిన్లు

**న్యూఢిల్లీ అక్టోబర్ 7 డ్రీమ్ టైమ్స్ న్యూస్**

ఇండియా దేశీయంగా తయారు చేస్తున్న తేజాస్ ఎంకే1ఏ యుద్ధ విమానాలకు మరింత అదనపు బలం చేకూరనుంది. అమెరికా నుంచి అత్యాధునిక యుద్ధ విమాన ఇంజిన్లు ఇండియా చేరుకున్నాయి. ఈ విమానాలను తేజాస్ యుద్ధ విమానాలకు అమరుస్తారు. అమెరికాకు చెందిన జీఈ ఏరోస్పేస్ సంస్థ ఎఫ్404-ఐఎన్20 ఇంజిన్లు నాలుగింటిని తేజాస్ విమానాలు తయారు చేస్తున్న హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) సంస్థకు అందాయి. గత సెప్టెంబర్‌లోనే ఈ ఇంజిన్లను సంస్థ అదుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ తరహా ఇంజిన్లు మొత్తం 14 అందాయి. అంటే, 14 తేజాస్ ఎంకే1ఏ విమానాలలో అమెరికా ఇంజిన్లను ఏర్పాటు చేస్తున్నారు. జీఈ ఏరోస్పేస్ సంస్థతో ఇండియా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మొత్తం 99 యుద్ధ విమాన ఇంజిన్లను సంస్థ అప్పగించాల్సి ఉంటుంది. వీటి విలువ మొత్తం రూ.5,375 కోట్లు. గత నెలలో 4 విమానాల్ని అందించామని, మిగతా విమానాల్ని అందించేందుకు కృషి చేస్తున్నామని జీఈ ఏరోస్పేస్ సంస్థ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధ విమానాల్లో ఎఫ్404-ఐఎన్20 ఇంజిన్లు అత్యంత ప్రబావవంతమైన, విజయవంతమైన ఇంజిన్లుగా గుర్తింపు తెచ్చుకున్నాయి. భారత వైమానిక దళ అవసరాలకు అనుగుణంగా హైయ్యర్ ఫ్లో ఫ్యాన్, సింగిల్ క్రిస్టల్ టర్బైన బ్లేడ్స్ వంటి అనేక ప్రత్యేక విడిభాగాలు ఈ ఇంజిన్‌లో ఉన్నాయి. ఈ ఇంజిన్లు తేజాస్ విమానానికి బాగా సరిపోతాయి. అమెరికాకు చెందిన జీఈ ఏరోస్పేస్ సంస్థతో ఇండియా కొన్ని దశాబ్దాలుగా కలిసి పని చేస్తోంది. 1980ల నుంచి యుద్ధ విమానాల తయారీలో ఇండియాకు సహకరిస్తోంది. ముఖ్యంగా తేజాస్ యుద్ధ విమానాలలో ఈ సంస్త ఇంజిన్లు కీలకంగా నిలిచాయి.



# డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

-ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ

-'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం

-డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్

-అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు

-గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం



**అమరావతి, ఏపీ బ్యూరో, నవ సంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

**డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలి**

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

**సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామన్న హోం మంత్రి**

హోం మంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజాసేవలో ప్రధాని మోదీ పాతికేళ్లు.. లోకేశ్ ప్రత్యేక పూజలు

-ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి

-వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి లోకేశ్ ప్రత్యేక పూజలు

-మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థన

-ప్రధానిని 'ఆధునిక ఉక్కు మనిషి'గా అభివర్ణించిన లోకేశ్

వికసిత్ భారత్ సంకల్పం -నెరవేరాలని ఆకాంక్ష





**అమరావతి,ఏపీ బ్యూరో, నవ సంఘర్షణ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అమరావతిలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయన, ప్రధాని మోదీ పేరు మీద అర్చన జరిపించి స్వామివారిని దర్శించుకున్నారు.

**నేటితో 25 ఏళ్లు**

2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రస్థానం ప్రారంభమై, నేటితో 25 ఏళ్లు (రజతోత్సవం) పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో లోకేశ్ పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ శ్రేయస్సు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రధానికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఆయన తలపెట్టిన 'వికసిత్ భారత్' వజ్రసంకల్పం నెరవేరాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

**ప్రధాని మోదీ ఆధునిక ఉక్కు మనిషి**

ప్రధాని మోదీని 'ఆధునిక ఉక్కు మనిషి'గా అభివర్ణించిన లోకేశ్, ప్రపంచంలోనే దేశాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలపాలనే లక్ష్యంతో ఆయన నిస్వార్థంగా పనిచేస్తున్నారని అన్నారు. ఆయనకు దేవుడు మరిన్ని శక్తియుక్తులు ప్రసాదించాలని ఆకాంక్షించారు. మోదీ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ యాత్ర' నిర్వహించడం దేశాభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు

# ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాలి

- సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు బోల్గం నాగరాజ్ గౌడ్
- పారదర్శకత, నిష్పక్షపాతమే ఎన్నికల సంఘానికి ప్రాధాన్యం కావాలి



**మిడ్జిల్ , అక్టోబర్ 07 నవ సంఘర్షణ**

ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడేలా కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మిడ్జిల్ సర్పంచ్ సంఘం ఉపాధ్యక్షుడు బోల్గం నాగరాజ్ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రతిపక్షాలు, ప్రజలు వ్యక్తం చేస్తున్న అనుమానాలు, ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టమైన ఆధారాలతో సమాధానం ఇవ్వాలని కోరారు. ఓటర్ల జాబితాల రూపకల్పన నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో పారదర్శకత ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై వస్తున్న ఆరోపణలకు సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేని పరిస్థితి ఉంటే, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని నాగరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం ద్వారా ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని నాగరాజ్ గౌడ్ కోరారు.'

# సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి స్వామి, దామచర్ల సత్య,

-ప్రజా వేదిక, సభా ప్రాంగణం ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి దామచర్ల సత్య, ఎమ్మెల్యే ఉగ్ర





**జరుగుమల్లి,ఒంగోలు, ప్రకాశం బ్యూరో, నవ సంఘర్షణ**

కొండపి నియోజకవర్గం జరుగుమల్లి మండలం నర్సింగోలులో ఈ నెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సీఎం పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమానికి సంబంధించిన ప్రజా వేదిక, సభా ప్రాంగణం, వేదిక నిర్మాణం, ప్రజలు తరలివచ్చే మార్గాలు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయం తో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. సీఎం పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఏపీలో మరో 58 వేల మందికి 'తల్లికి వందనం'.. క్యాబినెట్ నిర్ణయం

-'తల్లికి వందనం' పథకం విస్తరణకు కేబినెట్ ఆమోదం

-కొత్తగా 58,601 మంది విద్యార్థులకు అందనున్న ప్రయోజనం

-మొత్తం లబ్ధిదారుల సంఖ్య 68 లక్షలు దాటిన వైనం

-దసరా పండుగ లోపు తల్లుల ఖాతాల్లో నగదు జమ

**అమరావతి, ఏపీ బ్యూరో, నవ సంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం పరిధిని విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద కొత్తగా మరో 58,601 మంది విద్యార్థులను అర్హులుగా చేర్చుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పథకం ద్వారా లబ్ధి పొందే వారి సంఖ్య మరింత పెరగనుంది.తాజా చేర్పులతో రెండో విడతలో ఆర్థిక సహాయం అందుకునే విద్యార్థుల సంఖ్య 3,29,201కి చేరుకుంటుంది. ఫలితంగా, రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హులైన మొత్తం విద్యార్థుల సంఖ్య 67,47,190 నుంచి 68,05,791కి పెరగనుంది.రెండో విడతకు సంబంధించిన నిధులను దసరా పండుగలోపు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ద్వారా విద్యార్థుల చదువులకు ఆర్థికంగా చేయూత అందించడమే ప్రభుత్వ ఉద్దేశం

# సీఎం చంద్రబాబును కలిసిన ఏషియన్ గేమ్స్ విజేతలు

-రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చారంటూ క్రీడాకారులను అభినందించిన సీఎం

-మొత్తం 8 పతకాలు సాధించినట్లు వెల్లడించిన శాప్ ఎండీ

-క్రీడాకారులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని చంద్రబాబు హామీ



**అమరావతి, ఏపీ బ్యూరో, నవ సంఘర్షణ**

2026 ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకాలు సాధించిన క్రీడాకారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా సత్కరించారు. బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విజేతలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని చాటి చెప్పినందుకు వారిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో క్రికెటర్ శ్రీచరణి, ఆర్చర్లు గణేశ్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. భవిష్యత్తు లోనూ మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీఎం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడాకారులు సాధించిన పతకాల వివరాలను శాప్ (శాాయ్యా) ఎండీ భరణి ముఖ్యమంత్రికి వివరించారు. మూడు వేర్వేరు క్రీడాంశాల్లో మన అథ్లెట్లు 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి మొత్తం 8 పతకాలను గెలుచుకున్నారని ఆయన తెలిపారు. ఈ విజయాల స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహకాలతో పాటు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు

# కెమిస్ట్రీలో ఇద్దరికి నోబెల్ పురస్కారం




**స్టాక్‌హోమ్:**
ఈ ఏడాది రసాయన శాస్త్రంలో ఇద్దరు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి దక్కింది. హెన్రీ బీ కగన్, కెన్సో సోయిలను అవార్డు వరించింది. ఫార్మసీ ఉత్పత్తులకు అవసరమైన రియాక్షన్ డిజైన్లను ఇద్దరు కెమిస్ట్‌లు రూపొందించినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది. ఫ్రెడ్రిక్ సాంజర్, బ్యారీ షార్ప్‌లెస్‌కు రెండు సార్లు కెమిస్ట్రీ అవార్డు. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఈ అవార్డును ప్రదానం చేస్తుంది. 1901 నుంచి ఇప్పటి వరకు 117 సార్లు రసాయన శాస్త్రంలో నోబెల్ అవార్డులు ఇచ్చారు. 198 మంది కెమిస్ట్రీలో అవార్డు తీసుకున్నారు. 35 ఏళ్ల వయసులో ఫ్రెడ్రిక్ జోలియట్ కెమిస్ట్రీ అవార్డు అందుకున్నారు. 97 ఏళ్ల వయసులో జాన్ బీ గుడ్‌ఎనాఫ్ ఈ అవార్డును స్వీకరించారు.

## పాక్‌కు భారత నేవీ రహస్యాలు..

**- 18 మంది అనుమానితుల్లో ఇద్దరి అరెస్టు**



హైదరాబాద్,
భారత నౌకాదళానికి సంబంధించిన అత్యంత సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఓ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు చేధించారు. ఈ నెట్‌వర్క్‌లో 13 మంది నేవీ సిబ్బంది సహా 18 మంది ప్ర మేయం ఉన్నట్టు అనుమానిస్తున్న అధికారులు 12 బృందాలుగా విడిపోయి 'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026' పేరిట ఇటీవల దే శంలోని 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరిని అరె స్టు చేశారు. వీరిలో విశాఖపట్నానికి చెందిన కాంట్రాక్టు డ్రైవర్ అన్నం సాయివరప్రసాద్, కోయంబత్తూర్‌కు చెందిన నేవీ ఉ ద్యోగి ప్రదీప్ ముఖర్జీ ఉన్నారు. డబ్బు కోసం విశాఖలోని కీలక రక్షణ స్థావరాల స మాచారాన్ని ఎన్‌క్రిప్టెడ్ చానళ్ల ద్వారా పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఈ ఇద్దరి నుంచి అధికారులు కొన్ని ఆధారాలు సేకరించడంతోపాటు స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికారాలు విశ్లేషిస్తున్నారు. మిగిలిన అనుమానితుల కోసం వేట కొనసాగిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌పై ఇప్పటికే విజయవాడలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు నమోదయ్యాయి.

## భారత్‌లో ఈవీ వాహనాల అమ్మకాల జోరు..

**-సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో అమ్మకాలు**



**న్యూఢిల్లీ,**
భారత ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. సెప్టెంబర్ నెలలో ఈవీ రిటైల్ విక్రయాలు ఆల్ టైమ్ రికార్డును సృష్టించాయి. ఈ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా 3,33,634 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవడం గమనార్హం. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఇది 74 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలను ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ సమాఖ్య (ఫాడా) బుధవారం విడుదల చేసింది. ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ స్పందిస్తూ, ఇది కేవలం గతేడాదితో పోల్చిన వృద్ధి మాత్రమే కాదని, ఒక సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. పండగ సీజన్ డిమాండ్, పెట్రోల్ ధరలతో పోలిస్తే తక్కువగా ఉన్న నిర్వహణ ఖర్చులు, మార్కెట్లోకి వస్తున్న కొత్త మోడళ్లు, పీఎం ఈ-డ్రైవ్ వంటి ప్రభుత్వ పథకాల ప్రోత్సాహం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈవీ మార్కెట్ కేవలం సబ్సిడీలపైనే కాకుండా, వినియోగదారుల డిమాండ్ ఆధారంగా పుంజుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా పరిశీలిస్తే, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయాలు 88.67 శాతం వృద్ధితో 2,07,314 యూనిట్లకు చేరాయి. అలాగే, ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల విక్రయాలు 94.56 శాతం పెరిగి 36,108 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ రెండు విభాగాల్లోనూ అమ్మకాలు ఆల్ టైమ్ హై స్థాయికి చేరడం విశేషం. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల విక్రయాలు 86,024 యూనిట్లుగా, కమర్షియల్ వాహనాల అమ్మకాలు 4,188 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ భారీ విక్రయాలతో దేశంలోని మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా గతేడాది ఉన్న 10 శాతం నుంచి ప్రస్తుతం 13 శాతానికి పెరిగింది.

# రష్యాలో ఆయిల్ ట్యాంకర్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి..

**23 మంది ఇండియన్స్ సురక్షితం..!**



రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య దాదాపు ఐదేళ్లుగా యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. తాజాగా నల్లసముద్రం లో ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. రష్యా రిసార్ట్ నగరమైన సోచి సమీపంలో లైబీరియా జెండా తో వెళ్తున్న ఓ భారీ ఆయిల్ ట్యాంకర్‌పై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడికి పాల్పడింది. దాంతో ట్యాంకర్‌లో భారీగా మంటలు చెలరేగాయి. దాడి సమయంలో ట్యాంకర్‌లో ఉన్న సిబ్బంది మొత్తం భారతీయులే కావడం గమనార్హం. దాడి జరిగినప్పుడు ఆయిల్ ట్యాంకర్‌లో ఉన్న 23 మంది భారతీయ సిబ్బందిని సురక్షితంగా కాపాడినట్లు రష్యా రవాణా మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇది భారత అధికారులకు కొంత ఊరట కలిగించే విషయమని తెలిపింది. 'నేవల్ డ్రోన్ల' ద్వారా ఈ దాడి జరిగిందని అధికారులు చెప్పారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అగ్నిమాపక సిబ్బంది వాటిని అదుపు చేయలేకపోతున్నారని అన్నారు. ట్యాంకర్ నుంచి ముడిచమురు సముద్రంలోకి వ్యాపించి మండుతోందని, మంటలు కొంచెం తగ్గిన తర్వాత మళ్లీ ఆర్పే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సోచి నగరం సమీపంలో సముద్రంపై భారీగా నల్లటి పొగ, నారింజ రంగు మంటలు ఎగిసిపడుతున్నట్లు వీడియోల్లో కనిపిస్తున్నది. దాంతో సోచి నగర మేయర్ ముందుజాగ్రత్త చర్యగా తీర ప్రాంతానికి, బీచ్‌లకు ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించారు. అయితే నల్లసముద్రంలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. 2022లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరు దేశాలు వాణిజ్య నౌకలను టార్గెట్ చేస్తున్నాయి. కాగా రొమేనియా తీరంలో ఓ నౌక మునిగిపోయి ఒకరు మృతి చెందిన ఘటన జరిగిన మరుసటిరోజే ఉక్రెయిన్ ఈ డ్రోన్ దాడికి పాల్పడటం గమనార్హం. ఈ దాడి రష్యానే చేసిందని, అందులోనూ ఒక భారతీయ సిబ్బంది గాయపడ్డారని ఉక్రెయిన్ ఆరోపించింది. మరోవైపు రష్యా కూడా ఇటీవల ఉక్రెయిన్ ధాన్యాన్ని తరలిస్తున్న నౌకలపై దాడులు చేస్తున్నది. తమ నగరాలపై రష్యా చేస్తున్న దాడులకు ప్రతీకారంగానే రష్యా చమురు మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నామని ఉక్రెయిన్ వాదిస్తున్నది. ఇటీవలి వారాల్లో దాడులను తీవ్రతరం చేస్తామని ఇరుపక్షాలు ప్రకటించాయి. గతంలో రష్యాలోని చమురు కేంద్రాలపై జరిగిన ఉక్రెయిన్ దాడులవల్ల సముద్రంలో ఆయిల్ స్లిక్‌లు ఏర్పడటం, బీచ్‌లను మూసివేయడం, ఆకాశం నుంచి విషపూరిత నల్లటి వర్షం కురవడం వంటి పర్యావరణ నష్టాలు సంభవించాయి. ఇప్పటి ఈ ఘటనతో మరోసారి అలాంటి ముప్పు పొంచి ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఢిల్లీలో కూలిన బిల్డింగ్..

**- శిథిలాల కింద ఐదుగురు..**
**-కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్**



ఢిల్లీలో బిల్డింగ్స్ వరుసగా కూలిన ఘటనలు కలకలం రేపుతున్నాయి. తాజాగా మరో బిల్డింగ్ ఢిల్లీలో కూలిపోయింది. ఈశాన్య ఢిల్లీ, సీమాపురి ప్రాంతంలో అక్టోబర్ 7, బుధవారం మధ్యాహ్నం నాలుగంతస్తుల బిల్డింగ్‌కు సంబంధించిన ముందు భాగం కూలిపోయింది. దీంతో శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో ఢిల్లీలోని ఫైర్ సిబ్బంది, పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. పలు ఫైర్ ఇంజిన్లు, అంబులెన్సులు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఆలోపే స్పందించిన స్థానికులు శిథిలాల కింది నుంచి ఇద్దరు చిన్నారులను బయటకు తీశారు. శిథిలాల కింద ఇంకో ఐదుగురు చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. 25 చదరపు గజాల స్థలంలో ఈ బిల్డింగ్ ఉందని, కింద కొన్ని షాపులు ఉన్నాయని ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాలు తొలగిస్తున్నారు. వాటి కింద చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సమయంలో ఢిల్లీ పోలీసులు స్థానికులకు ట్రాఫిక్ సలహా ఇచ్చారు. సీమాపురితోపాటు పరిసర గోల్ చక్కర్, డీఎల్ఎఫ్ భోపురా రోడ్లు కాకుండా కుదిరితే వేరే మార్గాల్లో వెళ్లాల్సిందిగా వాహనదారులకు సూచించారు. ఎందుకంటే ఇక్కడ సహాయక చర్యల కోసం అంబులెన్సులు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే బాధితుల్ని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాల్సి ఉంటుందని, ఇందుకోసం ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనదారులు వేరే మార్గాల్లో వెళ్లాలన్నారు. తప్పనిసరిగా ఈ మార్గాల్లో వచ్చే వారు ఇక్కడ ఆగడం కానీ, వాహనాలు పార్కింగ్ చేయడం కానీ చేయరాదని ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఇక, ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# అమెరికాలో 40 మంది పౌరసత్వం రద్దు..

**-జాబితాలో పలువురు భారతీయులు!**



న్యూఢిల్లీ,
అమెరికా ప్రభుత్వం పౌరసత్వం విషయంలో కీలక చర్యలు చేపట్టింది. తప్పుడు వివరాలు ఇచ్చి లేదా తమ గతాన్ని దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మందిపై పౌరసత్వం రద్దు చేసేందుకు న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించింది. వీరిలో భారతీయుడు కూడా ఉన్నారు. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద 'డీ-న్యాచురలైజేషన్' చర్యగా న్యాయశాఖ పేర్కొంది. అమెరికా పౌరసత్వాన్ని మోసం, చట్టవిరుద్ధ మార్గాల ద్వారా పొందిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని దీంతో స్పష్టమవుతోంది. ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో ఈ 40 మందిపై సివిల్ కేసులు దాఖలయ్యాయి. వీరిలో కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసిన సమయంలో తమకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను దాచిపెట్టారని, తప్పుడు సమాచారం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. గూఢచర్యం నుంచి లైంగిక నేరాల వరకు వివిధ తీవ్రమైన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారని అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసాలను సహించబోమని స్పష్టం చేశారు. అమెరికా అధికారుల ప్రకారం బల్విందర్ సింగ్ రెండు వేర్వేరు గుర్తింపులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1992లో ఒక గుర్తింపుతో ఇమ్మిగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆయన 2003లో మరో గుర్తింపుతో శాశ్వత నివాస హోదా (పర్మినెంట్ రెసిడెంట్) పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత 2009లో అదే రెండో గుర్తింపుతో అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే రెండు వేర్వేరు దరఖాస్తుల్లో నమోదైన వేలిముద్రలను పరిశీలించిన అధికారులు అవి ఒకే వ్యక్తివని గుర్తించినట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ జాబితాలో అమెరికా నౌకాదళ మాజీ సైనికుడు జిన్‌చావో వీ కూడా ఉన్నారు. చైనాకు గూఢచర్యం చేశారనే ఆరోపణలతో ఆయన ప్రస్తుతం 200 నెలల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. మిగతా వ్యక్తులపై హత్య, మనీ లాండరింగ్, లైంగిక నేరాలు, పన్ను ఎగవేత, వివాహ మోసం వంటి పలు ఆరోపణలు ఉన్నట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ 40 మందిలో ఒక్క దేశానికి చెందిన వారు మాత్రమే లేరు. మెక్సికో, పాకిస్థాన్, చైనా, నేపాల్, ఇరాన్, నైజీరియా సహా 20కి పైగా దేశాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. వీరిపై ఉన్న ఆరోపణలు, పౌరసత్వం పొందే సమయంలో వారు ఇచ్చిన సమాచారం ఇతర అంశాలను కోర్టులు పరిశీలించనున్నాయి. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం ప్రకారం.. మోసం చేసి లేదా కీలకమైన సమాచారాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందినట్లు కోర్టులో రుజువైతే, వారి సహజీకృత పౌరసత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంది. పౌరసత్వం రద్దైన తర్వాత సంబంధిత వ్యక్తులను అమెరికా నుంచి బహిష్కరించే డిపోర్టేషన్ ప్రారంభం కావచ్చు. అయితే ఈ 40 మందిపై నమోదైన కేసులన్నీ ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఆరోపణలు కోర్టులో రుజువు కావాల్సి ఉంది.

# థాయ్ మహిళకు షాక్..

**ప్రేమ, పెళ్లి పేరుతో రూ.60 లక్షలు స్వాహా..**




**కాన్పూర్:**
సోషల్ మీడియా ద్వారా థాయ్‌లాండ్ మహిళతో పరిచయం పెంచుకున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యాపారి ఇర్ఫాన్.. ప్రేమ, పెళ్లి పేరుతో ఆమెను మోసం చేసి రూ.60 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత భారత్‌కు వచ్చేసి పరారయ్యాడు. భర్తను వెతుక్కుంటూ కాన్పూర్ వచ్చిన బాధితురాలికి.. ఇర్ఫాన్‌కు ఇప్పటికే పెళ్లై ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. డబ్బులు అడిగితే దాడి చేసి మతం మారాలని వేధించడంతో, బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

# బిజినెస్

## మళ్లీ తగ్గిన బంగారం ధరలు

**-బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలకు మరోసారి తగ్గుదల**
**-22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.600 తగ్గింపు**
**-22 క్యారెట్ల బంగారం ధర రూ.1,37,100**
**-24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.650 తగ్గింపు**
**-24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,570**
**-వెండి ధరలో మాత్రం ఎలాంటి మార్పు లేదు**
**-కిలో వెండి ధర రూ.2,45,000గా కొనసాగింపు**
**-తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు**



హైదరాబాద్:
బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు బుధవారం మరోసారి తగ్గాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.600 తగ్గడంతో రూ.1,37,100కు చేరింది. మరోవైపు 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై రూ.650 తగ్గింది. దీంతో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,570గా నమోదైంది. అయితే వెండి ధరలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. కిలో వెండి ధర రూ.2,45,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. బులియన్ మార్కెట్‌లో నమోదైన ఈ ధరలే తెలుగు రాష్ట్రాల్లోనూ కొనసాగనున్నాయి. బంగారం ధరలు తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది.

## పోస్ట్‌పెయిడ్ రీఛార్జ్ ధరలు పెంచేసిన ఎయిర్‌టెల్

**పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు ఎయిర్‌టెల్ భారీ షాక్**
**టారిఫ్‌లను 3 నుంచి 10 శాతం వరకు పెంపు**
**బుధవారం నుంచే కొత్త ధరలు అమల్లోకి**
**రూ.449 ప్లాన్ ధర రూ.499కు పెంపు**
**రూ.699 ప్లాన్ రూ.749కు పెంపు**
**రూ.999 ప్లాన్ ధర రూ.1,049కి చేరిక**
**ఏడాదికి 5 రోజుల అంతర్జాతీయ రోమింగ్ ఉచితం**
**కొత్త టారిఫ్‌లతో వినియోగదారులపై అదనపు భారం**




పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ షాకిచ్చింది. తన పోస్ట్‌పెయిడ్ టారిఫ్‌లను 3 నుంచి 10 శాతం వరకు పెంచింది. పెంచిన కొత్త ధరలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నట్లు సంస్థ వెల్లడించింది. దీంతో పలు ప్రముఖ పోస్ట్‌పెయిడ్ ప్లాన్ల ధరలు పెరగనున్నాయి. ఇప్పటివరకు రూ.449గా ఉన్న పోస్ట్‌పెయిడ్ ప్లాన్ ధరను రూ.499కి పెంచింది. అలాగే రూ.699 ప్లాన్ ధర రూ.749కి, రూ.999 ప్లాన్ ధర రూ.1,049కి చేరనుంది. దీంతో ఆయా ప్లాన్లను వినియోగించే కస్టమర్లకు నెలవారీగా అదనపు భారం పడనుంది. అయితే ధరల పెంపుతో పాటు వినియోగదారులకు కొంత ప్రయోజనాన్ని కూడా ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఏడాదిలో 5 రోజులపాటు అంతర్జాతీయ రోమింగ్ సేవలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది. కొత్త టారిఫ్‌లకు అనుగుణంగా పోస్ట్‌పెయిడ్ వినియోగదారులు ఇకపై పెరిగిన మొత్తాలను చెల్లించాల్సి ఉంటుంది.

## స్విగ్గీ, జొమాటో యూజర్లకు గుడ్‌న్యూస్.. తగ్గనున్న డెలివరీ ఛార్జీలు!

**-డెలివరీ ఛార్జీలపై జీఎస్టీ తగ్గించే యోచన**
**-18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించే ప్రతిపాదన**
**-ఫుడ్ డెలివరీ యాప్ వినియోగదారులకు ఊరట**
**-ఈ-కామర్స్ యూజర్లపైనా తగ్గనున్న భారం**
**-స్విగ్గీ, జొమాటో వంటి యాప్స్‌పై ప్రభావం**
**-అక్టోబర్ 8న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం**
**-57వ సమావేశంలో ప్రతిపాదనపై చర్చ**
**-నిర్ణయం అమలైతే వినియోగదారులకు ప్రయోజనం**







స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్స్, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే వారికి కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకునే యోచనలో ఉంది. ప్రస్తుతం డెలివరీ ఛార్జీలపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కేంద్రం ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై అక్టోబర్ 8న జరిగే జీఎస్టీ 57వ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. జీఎస్టీ రేటును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తే ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా ఆర్డర్లు చేసే వినియోగదారులపై పడుతున్న అదనపు భారం తగ్గే అవకాశం ఉంది. అలాగే ఈ-కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా వస్తువులు కొనుగోలు చేసే సమయంలో చెల్లించాల్సిన డెలివరీ ఛార్జీలపైనా ప్రభావం పడనుంది. అయితే జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగదారులకు ఎంత మేరకు ప్రయోజనం దక్కుతుందనేది ఆయా సంస్థలు ఛార్జీలను ఎలా సవరించాయనే దానిపై ఆధారపడి ఉంటుంది. అక్టోబర్ 8న జరగనున్న 57వ జీఎస్టీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరగనుంది. సమావేశంలో తీసుకునే నిర్ణయాన్ని బట్టి కొత్త జీఎస్టీ రేటు అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్స్‌తో పాటు ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే కోట్లాది మంది వినియోగదారులకు కొంత మేర ఆర్థిక ఊరట లభించే అవకాశం ఉంది.

# స్పోర్ట్స్

## టీ20ల్లో ఏడో ర్యాంక్‌కు చేరిన శ్రేయాస్ అయ్యర్

**-వెస్టిండీస్‌పై సెంచరీతో ర్యాంకింగ్స్‌లో భారీగా పురోగతి**
**-43 బంతుల్లో 102 పరుగులతో అదరగొట్టిన అయ్యర్**
**-ఏకంగా 18 స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంక్‌కు చేరిక**
**-కెరీర్‌లోనే అత్యుత్తమ టీ20 ర్యాంక్ సొంతం**
**-ఈ ఘనత సాధించిన మూడో భారత బ్యాటర్‌గా రికార్డు**
**-ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలు అగ్రస్థానాల్లో కొనసాగింపు**
**-టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు**
**-వైభవ్ సూర్యవంశీ 46వ ర్యాంక్‌కు చేరిక**



దుబాయ్: వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో శతకంతో చెలరేగిన భారత బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని భారీగా మెరుగుపరుచుకున్నాడు. ఏకంగా 18 స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇది టీ20ల్లో అయ్యర్ కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. తొలి టీ20లో శ్రేయాస్ అయ్యర్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. కేవలం 43 బంతుల్లోనే 102 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. అతడి విధ్వంసక ఇన్నింగ్స్‌తో ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారీగా పురోగతి సాధించాడు. గత ర్యాంక్‌తో పోలిస్తే 18 స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో స్థానానికి చేరుకున్నాడు. టీ20 ఫార్మాట్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్ అందుకున్న అయ్యర్.. ఈ ఘనత సాధించిన మూడో భారత బ్యాటర్‌గా నిలిచాడు. తొలి టీ20లో అతడు చూపిన దూకుడు ర్యాంకింగ్స్‌లోనూ ప్రతిఫలించింది. మరోవైపు టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలు అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు. తిలక్ వర్మ 10వ స్థానంలో నిలిచాడు. దీంతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు ఉండటం విశేషంగా మారింది. యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ కూడా ర్యాంకింగ్స్‌లో గణనీయమైన పురోగతి సాధించాడు. ఎనిమిది స్థానాలు ఎగబాకి 46వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. దీంతో భారత బ్యాటర్లకు టీ20 ర్యాంకింగ్స్‌లో మరిన్ని మెరుగైన స్థానాలు దక్కాయి. ఇక వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. వన్డేల్లో గిల్ టాప్ ర్యాంక్‌లో ఉండగా.. టీ20ల్లో శ్రేయాస్ అయ్యర్ ఏడో స్థానానికి చేరుకోవడం భారత క్రికెట్‌కు మరో విశేషంగా నిలిచింది.

## చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకుంటుంది

**అగార్కర్‌కు గంభీర్ ఎమోషనల్ మెసేజ్**



టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఘనంగా వీడ్కోలు పలికాడు. అగార్కర్ హయాంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు గెలవడాన్ని గుర్తు చేసుకున్న గంభీర్.. భవిష్యత్తులో చరిత్ర అతడిని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుందని పేర్కొన్నాడు. "అజిత్ భాయ్.. మీతో కలిసి పనిచేయడం ఎంతో గౌరవంగా భావిస్తున్నా. మీ హయాంలో సాధించిన మూడు ఐసీసీ ట్రోఫీలే మీ నమ్మకానికి నిదర్శనం. ఎప్పుడూ జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారు. చరిత్ర మిమ్మల్ని మరింత గొప్పగా గుర్తుంచుకుంటుంది. ధన్యవాదాలు. మీ భవిష్యత్తుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని గంభీర్ 'ఎక్స్'లో పోస్టు చేశాడు. 2023 జులైలో అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి హయాంలో భారత్ 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. ఆ తర్వాత 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్ సాధించింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న పరిమిత ఓవర్ల సిరీస్‌కు జట్లను ఎంపిక చేయడం అగార్కర్ చేపట్టిన చివరి బాధ్యతగా నిలిచింది. అగార్కర్ పదవీకాలం మంగళవారంతో అధికారికంగా ముగిసింది. ఖాళీ అయిన సెలెక్టర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రస్తుతం మాజీ భారత స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా తాత్కాలిక చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20లు, భారత్-ఏ జట్టుకు సంబంధించిన మూడు మ్యాచ్‌ల కోసం జట్ల ఎంపికలో అతడు పాల్గొన్నాడు. సెలెక్షన్ ప్యానెల్‌లో ఓజాతో పాటు శివసుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్పీ సింగ్ ఉన్నారు. కొత్త సెలెక్టర్ కోసం అక్టోబర్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థి కనీసం ఏడు టెస్టులు లేదా 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలి. మరో నిబంధన ప్రకారం ఐదు సంవత్సరాల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఉండాలి.

## భారత క్రికెట్‌కు 'రో-కో' ఒక వరం

**పాకిస్థాన్ మాజీ పేసర్ సోహైల్ తన్వీర్**




టీమిండియా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం భారత క్రికెట్‌కు దొరికిన ఒక వరం అని పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ సోహైల్ తన్వీర్ ప్రశంసించాడు. వారిద్దరి అపార అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని, రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని వారి సేవలు అత్యంత కీలకమని అభిప్రాయపడ్డాడు. ఇటీవల ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ సోహైల్ తన్వీర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "విరాట్ కోహ్లీ గణాంకాలే అతని సత్తా ఏంటో చెబుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు అతను ఎన్నో మధురమైన జ్ఞాపకాలను అందించాడు. కోహ్లీ వీలైనంత ఎక్కువ కాలం ఆడటం భారత క్రికెట్‌కు నిజంగా ఒక వరం" అని ఆయన అన్నాడు. ఇదే విషయాన్ని రోహిత్ శర్మకు కూడా వర్తింపజేస్తూ, వయసును ప్రతికూలంగా చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. 2024 జూన్ లో టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత కోహ్లీ, రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు, 2025 మేలో టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇద్దరూ కేవలం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో తన్వీర్ మాట్లాడుతూ.. "సీనియర్ ఆటగాళ్లకు తమ ఆటను ఎలా నిర్వహించుకోవాలో బాగా తెలుసు. అదే సమయంలో వారు యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయగలరు. రోహిత్ శర్మ తన ఫిట్‌నెస్, లయను కాపాడుకోగలిగితే, అతను, కోహ్లీ ఇద్దరూ జట్టులో కొనసాగడం శుభపరిణామం" అని వివరించాడు. 39 ఏళ్ల రోహిత్ శర్మ ఇటీవలి కాలంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో 92, 101 పరుగులు సాధించాడు. అతను 2027 ప్రపంచకప్‌లో ఆడతాడా? లేదా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ, ఫామ్, ఫిట్‌నెస్ ఉన్నంతవరకు వయసుతో సంబంధం లేదని తన్వీర్ నొక్కిచెప్పాడు. అనుభవజ్ఞులైన ఈ ఇద్దరు ఆటగాళ్ల మార్గదర్శకత్వంలో యువ జట్టు రాటుదేలుతుందని అభిప్రాయపడ్డాడు.

# బేబీ బంప్‌తో సమంత స్టన్నింగ్ లుక్..

**- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు!**



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న గ్లామరస్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రత్యేకమైన ఫ్యాషన్ లుక్‌లో సమంత ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా బ్లాక్ కేప్-స్టైల్ టాప్, మెరిసే సీక్విన్ స్కర్ట్‌లో ఆమె కనిపించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సమంత తాజా ఫోటోషూట్‌లో బ్లాక్ సాటిన్ హై-నెక్ టాప్ ధరించారు. దానికి ఫ్లోర్ లెంగ్త్ కేప్ స్లీవ్స్ జోడించడంతో ఆమె లుక్‌కు మరింత రాయల్ టచ్ వచ్చింది. డార్క్ బ్రాంజ్, బ్లాక్ సీక్విన్ డిజైన్‌తో ఉన్న హై-వెయిస్ట్ స్కర్ట్ ఈ మొత్తం లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎంతో స్టైలిష్‌గా కనిపించేలా ఈ లుక్‌ను రూపొందించారు. సమంతకు సంబంధించిన స్టైలింగ్, ఆభరణాలు, హెయిర్‌స్టైల్, మేకప్ మొత్తం కలిసి ఫోటోషూట్‌కు మరింత గ్లామర్‌ను తీసుకొచ్చాయి. తాజా ఫొటోల్లో సమంత తనదైన కాన్ఫిడెంట్ స్టైల్‌తో కనిపించారు. ఆమె ఫొటోలు సోషల్ మీడియాలోకి వచ్చిన వెంటనే అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. సమంత కొత్త లుక్ చాలా అందంగా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం సమంతకు సంబంధించిన ఈ ఫోటోషూట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆమె ఫ్యాషన్ సెన్స్, స్టైలిష్ లుక్‌పై అభిమానులు ప్రత్యేకంగా కామెంట్లు చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాణ రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆమె నిర్మాణంలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రంపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అదే సమయంలో 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్ తమిళం' కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తూ.. మరోవైపు 'రక్త బ్రహ్మాండ్' అనే వెబ్ సిరీస్‌లోనూ భాగమవుతున్నారు. దీంతో వ్యక్తిగత విషయాలతో పాటు వరుస ప్రాజెక్టులతోనూ సమంత ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తున్నారు. మొత్తానికి తాజా ఫోటోషూట్‌తో సమంత మరోసారి సోషల్ మీడియాలో తన గ్లామర్‌తో సందడి చేస్తున్నారు. ఆమె కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం అభిమానుల మధ్య విపరీతంగా వైరల్ అవుతున్నాయి.




# రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్న కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా.!



బాలీవుడ్ ప్రముఖ జోడీ కియారా అద్వానీ మరియు సిద్ధార్థ్ మల్హోత్రా మరోసారి తల్లిదండ్రులు కాబోతున్నారు. తాము రెండో బిడ్డ కోసం ఎదురుచూస్తున్నట్లు ఈ జంట సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 7న వారు పంచుకున్న ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. గతంలో 2025లో వీరికి మొదటి సంతానంగా కూతురు 'సారాయ్' జన్మించిన విషయం తెలిసిందే.తమ జీవితంలోకి మరో చిన్నారి రాబోతున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఈ దంపతులు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. మరోసారి దేవుడు మాకు అత్యంత గొప్ప బహుమతిని ప్రసాదించాడు. మా హృదయాలు ప్రేమ, కృతజ్ఞతలతో నిండిపోయాయి అని రాసుకొచ్చారు. ఈ గుడ్ న్యూస్ తెలిసిన వెంటనే సినీ పరిశ్రమలోని ప్రముఖులు, స్నేహితులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. తమ మొదటి ప్రెగ్నెన్సీ సమయంలో ఒక జత చిన్న తెల్లటి బేబీ సాక్స్‌ను పట్టుకుని ఫోటో షేర్ చేసిన ఈ జంట, ఇప్పుడు రెండో ప్రెగ్నెన్సీ ప్రకటనలో కూడా అవే సాక్స్‌లను ఉపయోగించారు. ఈ కొత్త పోస్ట్‌లో వారి కూతురి చిన్నారి చెయ్యి కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# మంచితనం బలహీనత కాదు!

నేటి సోషల్‌మీడియా యుగంలో ప్రశంసలతో పాటు ట్రోలింగ్స్ కూడా సహజమే. ముఖ్యంగా సెలబ్రిటీలు మాట్లాడే ప్రతీ మాటకు అర్థాన్ని వెతకడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో సాంఘిక మాధ్యమాల్లో వచ్చే ట్రోలింగ్స్, నెగెటివ్ ప్రచారంపై అగ్ర కథానాయిక రష్మిక మందన్న ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. తాను అందరితో సరదాగా, స్నేహపూర్వకంగా ఉంటానని, ఎవరి కోసమో తన వ్యక్తిత్వాన్ని మార్చుకోనని స్పష్టం చేసింది. 'ప్రతీ ఒక్కరితో సఖ్యతగా ఉండాలన్నది నా ఫిలాసఫీ.మంచితనం బలహీనత కాదు. అందరికి నేను నచ్చాల్సిన అవసరం లేదు. నేను ఉన్న చోట పాజిటివ్ వైబ్స్ ఉండాలని కోరుకుంటా. అందుకే అందరితో స్నేహపూర్వకంగా ఉంటాను. దాని వల్ల నా కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషంగా ఉంటారు' అని రష్మిక మందన్న పేర్కొన్నది. తాజా చిత్రం 'రణబాలి' ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్మిక మందన్న పై వ్యాఖ్యలు చేసింది. వివాహానంతరం విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న కలిసి నటించిన 'రణబాలి' ఈ నెల 16న భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్నది.

# రజినీకాంత్ 'జైలర్ 2' సెన్సార్ పూర్తి..

**-రన్‌టైమ్ ఎంతంటే!**




సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' విడుదలకు సిద్ధమవుతోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుండగా తాజాగా ఈ చిత్రం. సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి 'యూ/ఏ 16 ప్లస్' సర్టిఫికేట్‌ను జారీ చేసింది.సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న సెన్సార్ వివరాల ప్రకారం, 'జైలర్ 2' సినిమా నిడివి 165 నిమిషాల 18 సెకన్లుగా లాక్ చేయబడింది. అంటే ఇది మూడు గంటల కంటే తక్కువ సమయమే ఉంది. 2023లో వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'జైలర్' రన్‌టైమ్ సుమారు 168 నిమిషాలు కాగా, దానితో పోలిస్తే ఈ సీక్వెల్ కేవలం మూడు నిమిషాలు మాత్రమే తక్కువగా ఉంది. భారీ తారాగణం, కొత్త పాత్రలతో ఈ ఫ్రాంచైజీని మరింత విస్తరిస్తూ నెల్సన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రజినీకాంత్ మరోసారి ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగం విజయవంతం కాగా, ఈ సీక్వెల్‌లో ఎస్.జె. సూర్య, విద్యాబాలన్, సూరజ్ వటటంజారమూడు, మిథున్ చక్రవర్తి వంటి ప్రముఖ నటులతో పాటు మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ కూడా తిరిగి తమ పాత్రల్లో అలరించనున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సెన్సార్ ప్రక్రియ పూర్తి కావడంతో మేకర్స్ ఇప్పుడు రిలీజ్ ఏర్పాట్లతో బిజీగా ఉన్నారు.

# లేడీస్ కాలేజీలో చేరిన అబ్బాయి..

**- ఆకట్టుకుంటున్న 'హైకూ' ట్రైలర్!**




తమిళ దర్శకుడు యువరాజ్ చిన్నసామి దర్శకత్వంలో తెరకెక్కిన క్యూట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'హైకూ' . ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. మహిళా కాలేజీలో అనుకోకుండా మన హీరో జాయిన్ అవుతాడు. మరి అతడు జాయిన్ అయ్యాక ఏం జరిగింది. కాలేజీలో హీరో పడే పాట్లు, ఆ తర్వాత అనుకోని పరిస్థితులలో ఇద్దరు అమ్మాయిల మధ్య నలిగిపోయే ట్రయాంగిల్ లవ్ ట్రాక్ ట్రైలర్‌లో ఎంతో ఆసక్తికరంగా చూపించారు.'కోర్ట్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించిన శ్రీదేవి అప్పల ఈ చిత్రంలోనూ లీడ్ రోల్‌లో నటించగా, హీరో ఏగన్ మరియు ఫెమినా జార్జ్ జోడీ స్క్రీన్‌పై చాలా ఫ్రెష్‌గా కనిపించారు. సిద్ధు కుమార్ అందించిన సంగీతం, ప్రియేష్ గురుస్వామి సినిమాటోగ్రఫీ విజువల్స్‌ను చాలా కలర్‌ఫుల్‌గా, రిచ్‌గా ప్రెజెంట్ చేశాయి. విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై డా. డి. అరులానందు, మాథెవో అరులానందు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ ఫీల్-గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ అక్టోబర్ 23, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.